# ★ మహాభినిష్క్రమణం ★

సులోచన

కాస్త మంచి సంబంధంకోసం వచ్చింది చావు గాకండా, చెప్పులరిగేటట్టు తిరిగి-అనుకొన్న సంబంధం విఫలమయ్యేప్పటికి విసుగు చెంది-చెప్పాల్సిన చోట నాలుగు మాటలు అతిశయంగా నమ్మేట్టు చెప్పి ఎలాగైతేం కొసకు అష్టకష్టాలూ పడి మంచి సంబంధం అనుకొన్న దాన్ని ఒప్పించి, కన్ను లొట్టబోయి యింటికొస్తే, అదేం కర్మమోగాని ఆ పిల్లవాడు పిల్లకు నచ్చకపోగా నాకు పెళ్ళి వద్దంటుంది-ఈ తతంగాలతోనే రామకృష్ణయ్యగారు ఓర్పువహించి ముగ్గురు పిల్లలకూ పెళ్లిళ్లుచేసి ఎదలోని బరువుని కాస్త తీసి వేసుకోగలిగారంటే నిజంగా ఆయన్ని శ్లాఘించాల్సిందే.

కాని ఇంకో పిల్ల-కడగొట్టుపిల్ల వుంది. ఆపిల్లంటే ఎందుకో గాని రామకృష్ణయ్యగారికి అమిత ప్రేమ. చివరిపిల్ల కావడం చేతే నేమో. ఆమె పెళ్ళి విషయంలో ఆయనగారు తీర్మానించుకొన్నదేమిటంటే: ఇదివరకు చేసిన పెళ్ళిళ్లలాగ కాకండా, కాస్త ఆలస్యమైనా చదువుకొన్నవాడు, విజ్ఞానానికి అలవడినవాడూ, తనంతట తాను వచ్చి పిల్లను చూచి, ఇద్దరూ యిష్టపడ్డాక ఆ ప్రకారమే వాడికి యివ్వాలి-చివరకు కట్నం ఎక్కువయినా తక్కువయినా. ఈ అభిప్రాయం అత్యుత్తమమైందే కాని, ఈ పద్ధతి మీద వివాహం జరగటమనేది ఎప్పటికో! అందులో రామకృష్ణయ్యగారు గొప్ప ఆస్థిపరుడేమీ కాదు, పలుకుబడి అంతకన్నా లేదు. ఒట్టి పిసినిగొట్టని మాత్రం ప్రతీతి. నిజ మాలోచిస్తే ఈ అభిప్రాయం రామకృష్ణయ్యలాంటి వారికి కలిగి వుండవల్సింది గాదు.

కోతికి కొబ్బరికాయ దొరికినట్లు రామకృష్ణయ్యగారు తలపోసినట్లుగానే ఓ సంబంధం వచ్చింది. పొలం ఆట్టే వున్నవాడుకాదు గాని గుణంలో, ఆకారంలో, నడవడిలో కాస్త మంచివాడిగా తోచి తత్‌క్షణమే పెళ్లి చేయాలని కూచున్నారు రామకృష్ణయ్యగారు.

భార్య అన్నదిగదా: 'ఏమండీ, కాస్త పొలం వున్నవాడైతే ఏ కష్టాలొచ్చినా ఆదుకోగలడు. మన అమ్మాయికిగూడా మర్యాదల్లో ఏ లోటూ వుండదు. కాస్త విచారించి ధనంగలవాడికివ్వండి.'

ఆయనకు ఉదాత్తంగా, ఉన్నతంగా తోచిన అభిప్రాయంమీద గట్టి నమ్మకం ఉండటమే కాకండా-అది గుడ్డినమ్మకం, మూఢనమ్మకం అని ఆక్షేపించేవాళ్ళమీద విరుచుకు పడతాడనేది జ్ఞాపకానికొచ్చాక తడబడుతూ మళ్లా అన్నది: "మీకు మంచిగా తోస్తే చేయండి. అడ్డు పెట్టాల్సిన అవసరం నాకు లేదు. మొదటి ముగ్గురు పిల్లలకూ మీరే, మీ యిష్టప్రకారమే చేశారు. ఇదిగూడా అలాగే కానియ్యండి."

రామకృష్ణయ్యకు భార్య యిలా బాధ్యతా రహితం చేసుకొని తనని బాధ్యతా సహితుణ్ని చేయడం బావుండలేదు. పిల్లకు పెళ్ళిచేసే విషయంలో తలిదండ్రు లిద్దరూ సమానబాధ్యతను కలిగివుండాలనేది భార్యకు తెలీక పోవటాన్ని గూర్చి విచారిస్తూ—

"నీవు ఇలా తప్పించుకోవడం బావుండలేదు. ఆస్థికోసం అర్రులు చాస్తే వచ్చే అవాంతరాల్ని ఆదుకోలేము. కాస్త కాలేజీలో చదువుతున్న వాడికీ, భవిష్యత్తు వున్నవాడికీ యిద్దామని నా యూహ గాని మరేంగాదు. చదువుకొన్నవాడూ, పొలంగలవాడూ, అందమైనవాడూ, అన్ని హంగులూకలవాడూ దొరకటం అసంభవం. ఎప్పటికైనా దొరకడా అనే గనక మన మనుకుంటే పిల్లకు పెళ్ళి చేయాల్సిన అవసరం కలగదు. కాళ్లదగ్గరకొచ్చిన సంబంధాన్ని కాలదన్నటం మంచిదిగాదు."

మళ్ళా అందుకున్నాడు-

'చదువుకొని నాలుగు రాళ్ళు సంపాదించుకొని సౌఖ్యంగా వున్నవాళ్ళని మన మెంతమందిని చూడటంలేదు. అసలు అంత అవసరం దేనికి, ఎంతలేదన్నా నాలుగెకరా లిస్తాంకదా- అంటే పెళ్ళిలో కాకపోయినా, తరువాత దానితోనే హాయిగా కాలం గడుపుతారు. మనకు 'కృష్ణా, రామా' అనుకొనే కాలం ఆసన్నమైంది.''

* * *

అయిదు రోజులు పెళ్ళి చేయకపోయినా, కాస్త దెంపుగా పెట్టి, పెండ్లివారిని ఆప్యాయంగా గౌరవించి, తగిన పారితోషికాలిచ్చి మంచివాడి అనిపించుకొన్నారు రామకృష్ణయ్యగారు. కాని అల్లుడికేమీ కట్నం చదివించలేదనే కారణంచేత పెళ్ళికొచ్చిన కొంతమంది పెద్దలు నిందించారు. సమాధానంగా ప్రస్తుతం తన యాజమాన్యంక్రింద వున్న నాలుగెకరాల పొలం ఎవ్వరికీ యిచ్చే అవసరం లేదనీ, అది ఒక్క తన పిల్లకే యిస్తాననీ, అందులో మీరేమీ అనుమానపడాల్సిన అవసరం లేదనీ—ఆ పొలం యిప్పుడు వ్రాసి యివ్వడానికి తనకెట్టి అభ్యంతరం లేదు కాని, కొన్ని అవాంతరాభ్యంతరాలవల్ల జాగు జరుగుతుందనీ రామకృష్ణయ్యగారు చెప్పారు. ఎలాగో సమాధానపడి పెళ్ళివారు వెళ్ళిపోయారు.

ఇక రామకృష్ణయ్యగారు చేయవల్సింది ఒక్క పని: మంచి ముహూర్తం ఏర్పాటుచేసి ఆ కార్యంకూడా చేసేస్తే మనపని తీరిపోతుందని తలచాడు. ఒకనాడు ఫలానా రోజు రావల్సిందని లేఖ పంపించాడు. సకాలానికి వచ్చి పని ముగించుకొని అందరూ వెళ్ళారు. అల్లుడుగారు మటుకు విధిగా వెనక్క వుండిపోయారు.

మరునాడు రాత్రి-

'అబ్బా! అంత సిగ్గయితే ఎలాగు?' అల్లుడు నాగరాజు అన్నాడు గులాబి రేకులవంటి చెక్కిళ్ళపై బలంగా ముద్దు పెట్టుకొంటూ-

'సిగ్గనేది స్త్రీకి భూషణమే అయినా ఇటువంటప్పుడుకూడా సిగ్గునభినయిస్తే ఎలాగు?'

'మరి-నువ్వు ఎంతవరకూ చదువుకున్నావ్!'

'ఏదో-అయిదో క్లాసువరకు.'

'ఓస్! ఇంతేనా...చదువు చెప్పించే విషయంలో మీ తలిదండ్రులారు. చలంగారి పుస్తకాలు చదువుతావా?'

'చలం ఎవరు?'

'సరే...అసలు నవల్లు చదువుతావా?'

'ఏమో! నాకు తెలీదు. యింట్లో వున్న ఆంధ్రనామ సంగ్రహమూ, తెనాలి రామకృష్ణుని కథలూ, పదునారు రాజులకథలూ...'

'ఛీ! ఇక చాల్లే. వాటిల్లో ఏముంటుంది, ఒట్టిచెత్త-'

ఆమె ముఖం వెలవెలపోవడం మొదలెట్టింది. తను యిన్నిరోజులుగా చదివి, గొప్పగాభావించుకొని, నాన్న సహితం మంచి పుస్తకాలని పొగిడిన పుస్తకాల్ని, ఈనాడు తన భర్త వాటిల్లో వుండేవి వట్టిచెత్తని తృణీకరించడంలో వున్న ఆంతర్యం ఆమెకు తెలీలేదు.

'ఇంగ్లీషు నేర్పుతాగాని నేర్చుకుంటావా?'

'ఊఁ!' సంతోషంతో అంది.

కాగితంమీద ఏ, బి, సీ, డీలు వ్రాసి ఒళ్లో కూచోబెట్టుకుని బోధించాడు. ఇలా రెండు నెల్లు తంటాలుపడి యింగ్లీషులో పేరు వ్రాయడం, చలంగారి నవలలు చదవడం నేర్పాడు.

అల్లుడూ కూతుళ్ళ అన్యోన్యానురాగము చూసి రామకృష్ణయ్యగారూ, భార్యా మురిసిపోయారు. అప్పుడప్పుడూ భార్యతో అంటూ వుంటాడు:

'అప్పుడు నీవన్న వాక్యం గుర్తుకు తెచ్చుకో, పొలంగలవాడికి యివ్వాలన్నావ్. మంచిదే, కాని ధనవంతుడైన అల్లుడూ మన కూతురూ ఇంత అన్యోన్యంగా వుంటారనేది కల్ల. అసలు వాడు భార్యకి గూడు పెడతాడా?'

* * *

కొన్నాళ్ళు గడిచాక—

ఒకరోజు రాత్రి భార్యతో నాగరాజు అన్నాడు గదా—

'నాకు పైచదువు చదవాలనే వాంఛ బలంగా వుంది. మీ నాన్న ఏమంటాడో.'

'ఏమో! మీరే చదువన్నా చదవండి, మిమ్మల్ని విడచి ఒక్కక్షణం వుండలేను' అని అంది భర్తని దగ్గరకు లాక్కుంటూ.

'అసలు నే వెళ్లడం తటస్థిస్తే—అది వేరే సంగతి.'

'తీసుకెళ్ళరా? సరే... నేనంటే మీకు...'

'అబ్బే! ఛీ- అలాంటి భావాలు నాలో యింకా జనించలా?'

'అయితే, ముందు జరిగేస్తామన్న మాట' అమాయికంగా అన్నది.

'అదిగాదు గాని, నేను మా వూరికి వెళ్ళాలి!' అన్నాడు సంభాషణని తప్పిస్తూ.

'ఎప్పుడు వెళ్తారు? నేగూడా వస్తాను.'

'మా వూరెళ్ళి దాదాపు చాలా రోజులు కావస్తోంది.'

'మరి నన్ను తీసుకెళ్ళరూ?'

'మీ నాన్న ఏ వూరెళ్ళాడు, ఎప్పుడు వస్తాడు?'

'అక్కయ్యను చూట్టానికి వెళ్ళాడు. బహుశా రేపు రావొచ్చు. ఎప్పుడొస్తే మన కేంగాని మన ప్రయాణం ఎప్పుడు? మీయిల్లు చూసి చాలా రోజులైంది.'

'మీ నాన్నతో మాట్లాడాలి, అవసరమైన పనులున్నాయి. అసలు నిన్న వెళదామనుకో లేదు. గొడుగు తీసుకొని పోతోంటే ఏ పొలానికో అనుకొన్నాను.'

'అబ్బా! నాకు నిద్ర వొస్తోందండీ!' ఆవులించి పడుకొన్నది.

నాగరాజు ఎంతగా తరచినా తరగ శక్యము కాని యోచనాసముద్రంలో పడ్డాడు. తను వైవాహిక జీవితానికి దూరంగా వున్నప్పుడు తను కన్న కలలేమిటి? కాని, ఆ కలలు జరుగుతాయని, జరిగేందుకు వీలుగా కన్నాననీ తను అనుకొన్నాడా! కలలు కల్లలనే సత్యంమీద తనకు నమ్మకం వుంటే వుండొచ్చు. కాని ఎప్పుడైనా జరిగితే జరగొచ్చునే ఆశ కూడా లేక పోలేదు. తను బీదవాడై వుండికూడా, కొన్ని రోజులు దైన్య హైన్య జీవితాన్ని చవిచూసి కూడా తనకు ఒక ధనవంతుడు పిల్లనిస్తాడనీ, తను అప్పుడు గొప్పవాణ్ణవుతాననీ... ఈవిధంగా కలలు కన్న దినాలు వృథా అయితే తన జీవితం కూడా వృథా కావచ్చు. అంతగా కాకపోయి నప్పటికీ కొంచెంలో ధనవంతుడి అల్లుణ్ణయ్యానని గర్వించటానికి మామగారు ఇస్తానని సూచించిన నాలుగెకరాల నిక్షేపంలాంటి పొలం ఇవ్వక పోయె. పెళ్ళిలో నిక్కచ్చితంగా అడిగి పుచ్చుకొంటే బాగుండేది. నాన్న అడగ్గానే, కొన్ని అవాంతరాభ్యంతరాల వల్ల యిప్పుడు యివ్వలేక పోవచ్చు, కొంచెం విలంబనం జరగొచ్చు, అని రామకృష్ణయ్యగారనలా? పొలం వ్రాసి యివ్వడానికి అవాంతరమేమిటి? అందులో తన స్వంతపొలం వ్రాసివ్వడానికి అభ్యంతరమేమిటి? ఇదంతా...

మరునాడు వూరెళ్ళిన రామకృష్ణయ్యగారు వచ్చారు. కట్నం పొలం అడగాలని నాగరాజు ఎదురు చూస్తున్నాడు. కాఫీలయ్యాక రామకృష్ణయ్యగారు పేపరు చూస్తూ అన్నారు గదా-

'ఏరా, అబ్బాయ్! వెళ్ళాలనుకుంటున్నావుటగా?'

'ఔనండీ.'

'ఏం, ఇంకా పదిరోజుల్లో పండగ వస్తుంది గదా- తరువాత వెళ్ళ కూడదూ?'

'అఁ! ఎన్ని పండగలకు వుండలేదూ! అయినా యింటికెళ్ళి చాలా రోజులైంది.'

సంభాషణ ఆగిపోయింది.

ఎలా మొదలుపెట్టాలో తెలీలేదు నాగరాజుకి. ఏమని, అసలు ఎలా అడిగేట్టు కట్నం!

'ఏమండీ... మరి... కట్నం ఎప్పుడిస్తారండీ?' అని అనేటప్పటికి నాగరాజుకి ఒక నిముషం పట్టింది.

'ఓహో! కట్నమా? ఏం తొందరొచ్చింది!' అన్నాడు నవ్వుతూ—

ఏం తొందరొచ్చిందట! తొందర కాదూ మరి, నాలుగు సంవత్సరాలనాడు పెళ్ళి చేసి, పంటడబ్బు చిల్లి గానీ యివ్వకుండా తింటూ, కట్నం యివ్వమంటే ఏంతొందరొచ్చిందీ అని అనటమా? ఇదేనా మామగారు అనాల్సింది?

నాగరాజు అన్నాడు:

'ఇక అలా గంటే ఎలాగు? నాలుగు సంవత్సరాలనాడు పెళ్ళి చేసి, యింకా కట్నం యివ్వకుండా వుండే మామగారు ఎవరుంటారండీ.'

'నాలుగు సంవత్సరాలట, నాలుగు సంవత్సరాలు. ఏం, కట్నం యివ్వమనా అనుమానం?' అన్నాడు ఈసడింపుగా-

'అదికాదండీ, అప్పుడనంగా పెళ్ళి చేసి, పంటనా యివ్వక పోతిరి. అలాంటప్పుడు కట్నమూ అడక్కా, పంటా అడక్కా చేతులు

మడుచుకు కూచోమనా మీ అభిప్రాయం?' (కొంచెం రోషంగా.)

'సరే-బాగానేవుంది అల్లుడుగారి ఆదర్శం.' నిట్టూరుస్తూ అన్నాడు రామకృష్ణయ్యగారు.

'మీ ఆదర్శమేమిటి? ఏమీ అడక్కుండా వూరికే చేతులు కట్టుకు కూచోమనా?'

'ఎవరు కూచోమన్నారయ్యా, నీ కివ్వవలసిందేదో యిచ్చేస్తాను-అందరకూ ఎలాగో, ఏ లెక్క ప్రకారం యిచ్చానో నీక్కూడా, అలాగే ఆ లెక్క ప్రకారమే యిచ్చేస్తాను. నువ్వేమన్నా మాకు వేరా? అందరల్లుళ్ళూ ఎంతో నువ్వూ మాకంతే!' రామకృష్ణయ్యగారు లోన వున్న కుళ్ళునంతా కడిగేశారు. హృదయాన్ని నిర్మలం చేసుకున్నారు.

కొందరభిప్రాయాలూ, ఆదర్శాలూ, ఆచరణాలూ వానాకాలం మేఘాల లాటివి.

ఆ రకంలో రామకృష్ణయ్య గారొకరు.

నాగరాజు మరునాడు బండీ ఎక్కాడు. ఇన్నిరోజులుగా మామగారింట్లో వుండీ, మొదట అత్తమామల ఆదరాభిమానాలను పొంది, కడకు అందరి అభిప్రాయాలకు దూరమై, తను గొప్పవారి అల్లుణ్ణనే కలని కల్లగా మార్చుకొని, ఒక్కడే బండి ఎక్కాడు. భార్య వస్తానంది. వద్దన్నాడు. నీతండ్రి చివరికి ఏం చేసాడో చూడమన్నాడు.

* * *

ప్రియమైన రామకృష్ణయ్యగారికి...

మీ అల్లుడూ, వియ్యంకుడూ నమస్కరించి వ్రాయునది యేమనగా-

క్షేమం - మీరుగూడా క్షేమంగా వున్నారని తలుస్తాము. మీరు మీ అభిప్రాయాల్ని మార్చుకున్నట్టు తెలుస్తోంది. అలాంటప్పుడు మా అభిప్రాయాల్ని మార్చుకోవల్సిన అగత్యం పడుతుంది. మీరు పెళ్ళిలో నాలుగెకరాల భూమి యిస్తామనీ యిప్పుడు కాకపోయినా మరికొన్ని రోజులకైనా అల్లుడి గారికి యివ్వక తప్పదనీ, మరొకళ్ళ కిచ్చే అవసరం లేదనీ - మీరు చెప్పారు. అప్పటికి తృప్తిపడి మేము వూరుకున్న మాట వాస్తవమే.

ఇప్పుడు మీరు అలాగు యివ్వనని, అందరికిచ్చినట్టుగానే ఎకరమున్నర పొలం యిస్తామంటున్నారు. ఇది సమంజసంగా వుందని ఏ తెలివి తక్కువ వాడూ అనడని మీకూ, మాకూ తెలుసు. అప్పుడు ఏ ఉద్దేశ్యంతో నాలుగెకరాల పొలం యిస్తామన్నారు? ఇప్పుడు ఏ వుద్దేశ్యంతో ఎకరమున్నర పొలం యిస్తామన్నారు?

ఇంతకీ చెప్పవచ్చిందేమిటంటే? మీరు మొదట అన్నప్రకారం పొలం యివ్వకపోతే అమ్మాయిని వదులుకోవలసిన అగత్యం పట్టుతుంది. ఆసంగతి గమనిస్తారని ఆశిస్తాము.

ఇట్లు,
వియ్యంకుడు, అల్లుడు.

ఉత్తరం చూసి రామకృష్ణయ్యగారు అదిరిపోయారు. కర్తవ్యమేమిటి? మొదట అనుకున్నప్రకారం యివ్వాలా? తప్పదా? మొదట వారి నందుకు నిష్కృతా?


ఈ క్రింది ఊళ్లలో ఇంగ్లీషు, తెలుగు 'స్వతంత్ర' పత్రికలు అమ్ముటకు, ఏజెంట్లు కావలెను:

బళ్లారి, చోడవరం, చల్లపల్లి, ముద్దనూరు, నాగపూరు, నరసీపట్నం, పొన్నపల్లి అగ్రహారం, శృంగవరపుకోట, వెల్లూరు, ఎలమంచిలి, కైకలూరు.

వివరములకు :—

మేనేజరు, 'స్వతంత్ర'

160 లాయిడ్స్ రోడ్, రాయపేట, మదరాసు–14.